క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ట్రస్ట్ చైర్మన్

పాలకోడేరు: చలి వేంద్రాలు బాటసారుల దాహార్తిని తీరుస్తాయని, వీటిని ఏర్పాటు చేయడం చాలా మంచి కార్యక్రమమని పలువురు వక్తలు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని కోరుకొల్లు గ్రామంలో మంతెన వెంకట ప్రహ్లాదరాజు చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగీంద్ర కుమార్‌బాబు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.లక్ష్మీనరసింహరాజు, మైప సర్పంచ్ తిరుపతి రాజు, ఎం.పలపరాజు పి.భీమరాజు, వైజీ రామారావు, ఎంటీ. బంగార్రాజు, ఎస్.పృథ్వీ రాజు, సన్నిధి కిరణ్ మాజీ ఎంపీటీసీ కె.సోమేశ్వరరావు, కె.సూరిబాబు, కె.వెంకటేశ్వరరావు, ఎం.శివరామకృష్ణ, ఎం.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద అన్నపూర్ణ అన్నదాన ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు.

ఇంద్రజాల రంగంలో బోస్ సేవలు ప్రశంసనీయం

భీమవరం: కళారత్న పురస్కారం అందుకున్న భీమవరం పట్టణానికి చెందిన ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ బోస్‌ను బుధవారం పాలకొల్లు పట్టణానికి చెందిన హరివిల్లు సాంస్కృతిక సంస్థ ఘనంగా సన్మానించింది. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన అభినందన సభలో హరివిల్లు వ్యవస్థాపక అధ్యక్షుడు వంగా నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బోస్ ఇంద్రజాల రంగానికి, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించడానికి మేజిక్ రచనల ద్వారా ప్రజలను చైతన్యపరచి మంచి సమాజం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో హరివిల్లు ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వర్మ, గుండా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవతలకు సారె సమర్పణ

కాళ్ల: గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీమహంకాళమ్మ, శ్రీవెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు 400 మంది మహిళలు సారె బిందెలు, కావిళ్లతో ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించి అమ్మవార్లకు సారె సమర్పించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఉండి: మండలంలోని ఆరేడు గ్రామంలో ఈ నెల ఒకటో తేదీ గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు బుధవారం తెలిపారు.

ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: పట్టణంలో 29వ వార్డు ప్రకాష్‌నగర్ ఎస్‌టి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ప్రకాష్‌నగర్‌లో డ్రెయినేజీ, మంచినీటి కుళాయిలు, వీధిలైట్లు వెలగకపోవడం వంటి అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డి.త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, దుర్గారావు, సంజీవరావు, మరియమ్మ, అక్కులయ్య పాల్గొన్నారు.

పేదల కోసమే పోరాటం

ఆకివీడు: సీపీఎం పేదల కోసమే పోరాటం చేస్తుందని పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు చెప్పారు. పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పేదల ఇళ్లు పీకివేయడం దారుణమన్నారు. పెంకి అప్పారావు, డోకల రవితేజ, రాంబాబు, ఉదయకుమారి పాల్గొన్నారు.

పొంచి ఉన్న అగ్నిప్రమాదాల ముప్పు

- వేసవిలో జాగ్రత్తలు పాటించాలి
- నివారణ చర్యలు చేపడుతున్న అగ్నిమాపక శాఖ
- అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


భీమవరంలోని గునుపూడిలో అగ్నిమాపక కార్యాలయం

భీమవరం అర్బన్: వేసవి తాపం రోజురోజుకూ పెరుగుతోంది. ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల వాడకం గణనీయంగా పెరుగుతుంది. విద్యా సంస్థలకు వేసవి సెలవులు కావడంతో కొన్ని ఇళ్లలో దాదాపు 24 గంటలూ ఏసీలు పని చేస్తూనే ఉన్నాయి. మరో వైపు చెట్టు చేమ, పొలాలు, గడ్డి, తాటాకు ఇళ్లు ఇలా ఆరు బయట ఉన్న అన్నీ ఎర్రటి ఎండకు ఎండి పోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలకు అస్కారముంది. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా అగ్ని ప్రమాదాల ముప్పు తప్పదు. ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను ముందస్తుగా నివారించే అవకాశం ఉంటుంది. ప్రాణ, ఆస్తి నష్టాల నుంచి బయటపడొచ్చు.

అగ్ని ప్రమాదాల నివారణకు సిద్ధం



వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగితే నష్ట నివారణకు అన్ని ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉన్నాం. భారీ అగ్ని ప్రమాదం జరిగితే దగ్గరలోని స్టేషన్ల నుంచి వాహనాలను రప్పించి నష్ట తీవ్రతను తగ్గిస్తాం. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 08816–233299 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇస్తే వెంటనే వచ్చి మంటలను అదుపు చేస్తాం. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

–సీహెచ్ సూర్య ప్రకాష్‌రావు, జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి, భీమవరం

అగ్ని ప్రమాదాలకు అవకాశాలిలా..

- ఎండల తీవ్రతకు విద్యుత్ వినియోగం బాగా పెరుగుతుంది. దీంతో ఓవర్ లోడుకు తట్టుకోలేని పాత విద్యుత్ వైర్లతో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- ఎలక్ట్రిక్ హోల్డర్లు, ఇస్త్రీ పెట్టెలు, మిక్సీలు, వాషింగ్ మెషీన్లు వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినా, వాటికి ఉద్దేశించిన ప్లగ్‌లు వాడకపోయినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- భవనాల్లో హోమ్ థియేటర్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు వంటివి వాడేటప్పుడు కరెంట్ సరఫరాలో హెచ్చు తగ్గులు ఏర్పడి ప్రమాదాలు జరగొచ్చు.
- విద్యుత్ లైన్ నుంచి తాటాకు ఇళ్లకు నేరుగా వైర్లు లాగడం వలన కూడా ప్రమాదాలు జరుగుతాయి.
- ఎలవులు, తదితర కారణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంట్లో విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయనందు వలన ఒక్కోసారి షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు జరగొచ్చు.

అగ్నిమాపక నివారణ చర్యలు

- ఇళ్లలో లూజ్ వైరింగ్‌లు (అతుకులు) ఉండకూడదు. అలా ఉంటే షార్ట్ సర్క్యూట్ అయ్యి అగ్ని ప్రమాదం సంభవించొచ్చు.
- ప్లగ్ బోర్డులు, శ్లాబులలో వైరింగ్‌లు వైర్‌మెన్ నిర్దేశించినట్టుగానే వేసుకోవాలి. ఓవర్ లోడింగ్ వెళ్లే వైర్లు వేయకూడదు. (ఒక ప్లగ్ బోర్డులో నాలుగైదు వైర్లు వేయకూడదు)
- ఇంటికి వైరింగ్ చేసేటప్పుడు నాణ్యమైన వైర్లను మాత్రమే వాడాలి. లేకపోతే వైర్లు విద్యుత్ వేడి తీవ్రతకు నిప్పు పుట్టి ప్రమాదాలు జరగొచ్చు.
- పిల్లలకు అందుబాటులో కిరోసిన్, అగ్గి పెట్టెలు ఉంచరాదు. తెలియక వీరు అగ్గి పెడితే ప్రమాదాలు జరగొచ్చు.
- తాటాకు, గడ్డి, పూరిళ్లపై గాజు, అద్దాలు, అద్దం పెంకులు ఉండకూడదు. ఇవి ఉంటే సూర్య కిరణాలు వీటి మీద పడి వేడి తీవ్రత ఎక్కువై అగ్గి పుట్టి ప్రమాదం జరగొచ్చు.
- ఎప్పుడూ ఇంటిలో అందుబాటులో 200 లీటర్ల నీరు, రెండు బకెట్ల ఇసుక ఉంచుకుంటే ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఆర్పొచ్చు.
- వంట అయిపోగానే గ్యాస్ సిలండర్‌కు ఉన్న రెగ్యులేటర్‌ను కట్టి వేయాలి. అంతే కాకుండా వంట చేసేటప్పుడు కాటన్ దుస్తువులనే వాడాలి.

రొయ్యల అమ్మకం అవుట్‌లెట్ ప్రారంభం

వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరం మెయిన్ రోడ్‌లో మార్కెట్‌కు వెళ్లే దారిలో షాపింగ్ కాంప్లెక్స్‌లో పశ్చిమగోదావరి జిల్లా రొయ్య రైతుల ఆధ్వర్యంలో రొయ్యల అమ్మకం అవుట్‌లెట్‌ను బుధవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయుల చేతులు మీదుగా ప్రారంభించారు.

తమ్మిశెట్టి శ్రీనివాసరావుకు సత్కారం


తమ్మిశెట్టి దంపతులను సత్కరిస్తున్న వక్తలు

ఉండి: విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా సేవలు అందించడం ద్వారా అందరి మన్నలను పొందొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉండి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ట్రెనింగ్ ఆఫీసర్ తమ్మిశెట్టి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సత్కార సభ బుధవారం రాత్రి ఉండిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం తమ్మిశెట్టి శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులను కాపాడటమే ధర్మం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: సనాతన ధర్మంలో భక్తులను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నారు. సింహాగిరిపై కొలువుదీరిన వరాహ లక్ష్మీ నర్సింహస్వామి చందనోత్సవ కార్యక్రమానికి వెళ్లిన భక్తులు క్యూలైన్‌లో గోడ కూలి మృతి చెందిన సంఘటనపై బుధవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అత్యంత బాధాకరమైన సంఘటన అన్నారు. ఈ సందర్భంగా మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్ మాట్లాడుతూ భక్తులను, ప్రజలను మభ్యపెట్టే విధంగా కూటమి వ్యవహరిస్తుందన్నారు. కౌన్సిలర్ గేదెల అప్పారావు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ వర్షానికి గోడ కూలిపోయిందంటే దాని నిర్మాణం ఎంత దారుణంగా ఉందో స్పష్టమవుతుందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్ నిమ్మల నాగు పాల్గొన్నారు.

కమిషనర్‌పై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు


సర్వసభ్య సమావేశంలో కమిషనర్‌పై మూకుమ్మడిగా ధ్వజమెత్తుతున్న కౌన్సిలర్లు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్‌పై కౌన్సిల్ సమావేశం ధ్వజమెత్తింది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. మూడేళ్ల గడిచినా ఒక్క పనీ చేయించుకోలేకపోయామని వాపోయారు. దీంతో సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఒక్కసారిగా తమ ప్రశ్నలను సంధించడంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్ హైమావతి మాట్లాడుతూ సమావేశంలో వచ్చిన సమస్యలను సమావేశం అనంతరం కార్యాలయానికి వచ్చి వాటి పరిష్కారానికి కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి, నా దృష్టికి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. నెలకోసారి మాత్రమే సమావేశంలో మీకు సమస్యలు గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. మంచినీటి సమస్య పరిష్కారానికి పలు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యాలయంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఏ పనీ త్వరగా చేయలేకపోతున్నామన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి


డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏ సంఘ నేతలు

భీమవరం: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ బుధవారం డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల వేతనాలు పెంచాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు వీఆర్‌ఏలతో భర్తీ చేయాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ తాతలు, తండ్రుల పోస్టుల్లో వారసులకు పని చేయడానికి అవకాశం కల్పించారని అయితే వారిని వీఆర్‌ఏలుగా గుర్తించడం లేదన్నారు. వీఆర్‌ఏల పట్ల ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణితో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళా సంఘాల శాంతి ర్యాలీ

భీమవరం: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధాన్ని నిరసిస్తూ భీమవరం పట్టణంలోని ఆదివారం బజారు, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి నాచువారి సెంటర్ వరకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆరేటి రాణి, గంధం శ్రీదేవి, అల్లం వాణీ, శీతల్ పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు ప్రభుత్వ స్థలాల వినియోగం


పెదఅమీరంలో ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

కాళ్ల: ప్రజల సామాజిక అవసరాలకు ప్రభుత్వ ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకురానున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కాళ్ల మండలంలోని పెదఅమిరం పంచాయతీ పరిధిలోని పలు ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీఆర్వోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నాగేంద్ర, వీఆర్వో కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉండి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తింటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని ఎన్నార్పీ అగ్రహారం ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై ఉండి డివిజన్ ఇన్‌చార్జి మహేష్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, అధికారులు మాట్లాడుతూ మూస పద్ధతిలో పండించే పంటలకు స్వస్థిపలికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సంపాదించే ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రైతు బి.హరనాథరాజు, ప్రకృతి వ్యవసాయ మండల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ


బంగారం అందజేస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి బుధవారం తాడేపల్లిగూడేనికి చెందిన వైహెచ్‌ఎస్ సతీష్ ఫణి శిరీష దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారిచే అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ వారికి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

శ్రీశ్రీ సేవలు ఎనలేనివి

భీమవరం: ప్రజల్లో సామాజిక స్పృహ కల్పించడానికి శ్రీశ్రీ అభ్యుదయ రచయితగా ఎనలేని సేవ చేశారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగేశ్వరావు అన్నారు. బుధవారం శ్రీశ్రీ జయంతిని నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చాంద్ బాషా, ఎం.శ్రీనివాసరావు, ముస్తఫా ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం

కాళ్ల: ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తాగునీటి వ్యవస్థను పెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటే ఆరోపణలు చేయటం సరికాదని ఉండి డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, పెద అమిరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరం అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలో నీటి సంఘాల అధ్యక్షులతో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఏఎస్‌ఆర్ నగర్ వాసులకు న్యాయం చేయాలి

పాలకోడేరు: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 150చదరపు గజాల్లో ఇళ్ళు నిర్మాణం చేసుకున్న పేదలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తామన్న ఆదేశాలను పాలకోడేరు ఎ.ఎస్.ఆర్ నగర్ లో పేదల గృహాలకు అమలు చెయ్యాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జేఎన్వి గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏ.ఎస్.ఆర్ నగర్ లో ఇల్లు తొలగింపులో నిరాశ్రయులైన నిర్వాసితులకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రతి రోజూ నిర్వహిస్తున్న భోజన శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శేషపు అత్రియ్య, దున్నా మరియమ్మ, పాలా వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.